ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 11.09.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణలో హరిత విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

2. బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

3. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానానికి నిదర్శనంగా "సేవా సంకల్ప్ అభియాన్" నిర్వహిస్తున్నట్లు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వెల్లడించారు.

4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**భట్టి**

తెలంగాణలో హరిత విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 19 వేల 543 మెగావాట్లకు చేరిందని , పీఎం-

కుసుమ్ పథకం కింద రైతులకు 2 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు.

బైట్ ... భట్టి, ఉప ముఖ్యమంత్రి

డెస్క్

**పొన్నం**

బీసీలకు సామాజిక న్యాయం జరగా లంటే కులగణన తప్పనిసరని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనసభలో బీసీ కులగణనపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ , బీసీల జనాభా ఎంత ఉందో ఖచ్చితంగా తెలిస్తేనే వారికి అవసరమైన నిధులు , సంక్షేమ పథకాలు నిర్ణయించగలమని పేర్కొన్నారు. బీసీ ప్రధానమంత్రి అని చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం బీసీల జనాభా లెక్కించడానికి ఎందుకు వెనుకడుగు వేస్తోందని ఆయన ప్రశ్నించారు.

బైట్ ... పొన్నం ప్రభాకర్, మంత్రి

డెస్క్

**ట్రాన్స్ జెండర్లు**

రాష్ట్రంలో క్యూర్ పరిధి వెలుపల ఉన్న 9 మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లను నియమించనున్నట్టు శాసనసభలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతి కార్పోరేషన్ లో ఒకరిని ఎంపిక చేస్తామని తెలిపారు. తెలంగాణా మున్సిపల్ చట్టం-2019 కి సవరణ కోరుతూ ఈ మేరకు ఆయన బిల్లు ప్రవేశపెట్టారు.

డెస్క్

**మీటర్లు**

వ్యవసాయ మోటార్లు, పంప్‌సెట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర రైతాంగానికి, వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 100 శాతం హామీ ఇస్తున్నానని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడతారంటూ రైతుల్లో అనవసర భయాలు, అపోహలు సృష్టించవద్దని కోరారు.

డెస్క్

**వాకిటి**

శాసనసభలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు దానం కాదని , సామాజిక న్యాయం కోసం దశాబ్దాల పోరాట ఫలితమని స్పష్టం చేశారు. కాకా కాలేల్కర్ , మండల్ కమిషన్ల నుంచి జస్టిస్ రోహిణి కమిషన్ వరకు జరిగిన పరిణామాలను ఆయన ప్రస్తావించారు.

డెస్క్

**సేవా సంకల్ప్ అభియాస్**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశ వ్యాప్తంగా "సేవా సంకల్ప్ అభియాన్" నిర్వహిస్తున్నట్లు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వెల్లడించారు. ఈరోజు హైదరాబాద్ లోని పార్టీ ఆఫీసులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 2026 అక్టోబర్ 7 నాటికి మొత్తం 25 ఏళ్ల సేవను పూర్తి చేసుకుంటున్నారని తెలిపారు. మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు "ఆశీర్వాద్ కా దియా" కార్యక్రమం నిర్వహిస్తామని, నెలరోజుల పాటు బ్లడ్ డొనేషన్ క్యాంపులు , స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు , సంక్షేమ పథకాల లబ్ధిదారుల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

డెస్క్

**కేటీఆర్**

దేశ చరిత్రలోనే అతిపెద్ద భూదోపిడి తెలంగాణలో జరుగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత బాధితులతో బీఆర్ఎస్ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తమ

ప్రభుత్వంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత జాబితా ఇప్పుడు కోటి 16 లక్షల ఎకరాలకు చేరిందని అన్నారు.

డెస్క్

**బీజేపీ**

విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. నాచారంలోని డీపీఎస్ లో ఈరోజు జరిగిన యూత్ పార్లమెంట్లో ఆయన ప్రసంగించారు. తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న రభస , నిరాధార ఆరోపణలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ , సభా ప్రసారాలను చూసి పిల్లలు చెడు భాష నేర్చుకుంటారనే భయంతో తల్లిదండ్రులు టీవీలు కట్టేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, సహా 19 జిల్లాలకు పసుపురంగు హెచ్చరిక జారీ చేసింది.

పీఎస్

**వికసిత్ గ్రామపంచాయతీ**

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి వచ్చే ఐదేళ్లకు సరిపడేలా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికను పకడ్బందీగా సిద్ధం చేయాలని నల్లగొండ జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ జి.వి. రమేష్ అధికారులకు సూచించారు.

పీటీసీ నల్లగొండ

**గుడిపల్లి రిజర్వాయర్**

నాగర్ కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మూడో లిఫ్ట్ గుడిపల్లి రిజర్వాయర్‌ను మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పరిశీలించారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**గణేష్ ఉత్సవాల ఏర్పాట్లు**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు , వినాయక నిమజ్జనాన్ని శాంతియుత , ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.

పీటీసీ, నల్లగొండ

**బాలల హక్కులపై అవగాహన**

జోగులాంబ గద్వాల జిల్లా , కేటీ దొడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయంలో మహిళా , శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు మాట్లాడుతూ ... బాలికలు విద్య తోపాటు క్రమ శిక్షణ , నైతిక విలువలు అలపరచుకొని బాధ్యత గల పౌరులుగా ఎదగాలని సూచించారు.

పిటిసీ, జోగులాంబ గద్వాల

**మట్టి గణపతి**

పర్యావరణ పరిరక్షణ , కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అధికారులు, సిబ్బందికి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**జనగామ జిల్లా కలెక్టర్**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –2026 ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాల పరిశీలనను వేగవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.

పిటిసి, జనగామ

**కరీంనగర్ మేయర్**

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశ రక్షణ , అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద చికాగో ప్రసంగానికి 133 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో 'మై కంట్రీ , మై నేషన్ , మై రెస్పాన్సిబిలిటీ ' కార్యక్రమాన్ని నిర్వహించారు.

పిటిసి, కరీంనగర్

**అద్దాల పంపిణీ**

ఆసిఫాబాద్ జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ చేపట్టినట్లు జిల్లా వైద్యాధికారి నాగేంద్ర తెలిపారు. జిల్లాలోని 135 పాఠశాలలకు చెందిన 22 వేల 130 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 727 మందికి అద్దాలు అవసరమని గుర్తించి పంపిణీ పూర్తి చేశామన్నారు.

**పిటిసి, ఆసిఫాబాద్**